# లవ్ స్టోరీ

## ఆ వెన్నెల రాత్రి...?

బయట సన్నగా వర్షం పడుతోంది. కిటికీ తలుపుల్ని నెట్టుకుంటూ చలిగాలి లోపలికి దూసుకొస్తోంది. గదంతా చీకటి. బయట గాలి, వర్షం ఎక్కువయి నట్టుంది. "కరెంటు తీసేశారు" అంది ప్రణయ.

కొవ్వొత్తి కాంతిలో ఆమె శరీరం వింతగా మెరుస్తోంది. ఆమె శరీరం నుండి పరిమళాల సువాసనలు గదంతా వ్యాపించాయి.

ఆ నిశ్శబ్ద వాతావరణంలో- మౌనంగా పిలిచే ఆమె చూపుల్ని అంచనా వేస్తున్న నా మనసులో సన్నగా కలవరం!

గుండె పొరల్ని చీల్చుకుంటూ వస్తున్న అభిమానం చాటున ఏదో తెలియని పులకింత.

ఈ మౌనం ఇలా ఎంతసేపు?

ఆకర్షణ లేని ప్రేమలో థ్రిల్ ఏముంటుంది!

అలా అని ఆ ఆకర్షణలో పడి చేరకూడని చోటుకు దగ్గరైతే.....

అందుకే నా ఆలోచనలు బలవంతంగా ప్రక్కకు మళ్లించే ప్రయత్నం చేశాను.

"ప్రణయా! వర్షం కొద్దిగా తగ్గినట్టుంది..."

"అయితే వెళ్తున్నారా!" తీయగా పిలిచింది ఆమె గొంతు.

ఆ పిలుపు సుళ్లు తిరుగుతూ నా చెవుల్ని తాకి గుండెల్లో అలజడిని రేపింది కొన్ని క్షణాలు.

"నిజంగా వెళ్లాలని లేదు ప్రణయా! నిన్ను చూస్తూ రాత్రంతా గడిపేయాలనుంది..." అలా చెప్పాలనుకున్న మాటలు మధ్యలోనే ఆగిపోయాయి.

"వర్షం తగ్గిందిగా ఇంటికి వెళ్తాను. పైగా నీ టైం కూడా దగ్గరపడింది" అన్నాను.

ఏమనుకుందో ఆ మాటకు రుసరుస చూసింది నా వైపు" నేను వేశ్యననే విషయం గుర్తుచేస్తున్నారా!"

"లేదు ప్రణయా... నేను వెళ్లే సమయం వచ్చిందని చెప్పాను అంతే!"

"ఎందుకు భానూగారు ఆత్మవంచన చేసుకుంటారు. ఇన్‌డైరెక్ట్‌గా నా జీవితమేమిటో చెప్పారు అవునా! అయినా మీరన్నదాంట్లో తప్పేముంది. రాత్రి తొమ్మిది దాటితే నా ఇంటికి విటులు వస్తారు. వాళ్లు వచ్చేలోపు మీరు వెళ్లాలి అంతేగా?"

అనవసరంగా ప్రణయ మనసు కష్టపెట్టినట్టున్నాను. "ఏం చెప్పాలో క్షణం అర్థం కాలేదు నాకు"

"అది కాదు ప్రణయా..."

"మీరేమి చెప్పకండీ, ప్లీజ్ వెళ్లండి. కాసేపు ఇక్కడే ఉంటే మీ పవిత్రత మంట గలిసిపోతుంది" ముక్కుపుటాలు ఎగరేస్తూ రోషంగా నావైపు చూస్తూ అంది.

మనసులో ఉన్న ఆలోచనలు- కోరికలు ప్రణయకు చెప్పాలని ఉన్నా ఆమెను ఏడిపించడం ఇష్టం లేక మౌనంగా బయటకు నడిచాను.

* * *

"చాలా రోజుల తర్వాత ఇక్కడకు వచ్చారు. నా మీద కోపమా!"

"ఛ ఛ, అదేం లేదు ప్రణయా... ఏవో పనులుండి రాలేదు".

"ఆ రోజు మీరలా మాట్లాడితే నాకెందుకో బాధ అనిపించింది. అందుకే అలా ప్రవర్తించాను ప్లీజ్! జరిగింది మర్చిపోండి".

"ప్రణయా! నీవువట్టి అమాయకురాలివి. అసలేం జరిగిందని మర్చిపోవడానికి?"

"అయితే మిమ్మల్నో విషయం అడగనా?"

"అడగకూడనిదైతే మాత్రం వద్దు"

"అడగకూడనిది మాత్రం కాదు. ఎప్పుడో అడగాలని అనుకున్నదే... అదే.... మీరు ఈ రాత్రికి ఇక్కడే ఉండిపోకూడదూ!"

"ఇక్కడా?"

"ఏం... ఎందుకంత ఆశ్చర్యం! మిమ్మల్నెవరన్నా గుర్తుపడతారనా?"

"నా ఉద్దేశ్యం అదికాదు ప్రణయా... అలాంటి భయమే ఉంటే అసలు నీతో పరిచయం ఎందుకు పెంచుకుంటాను. ఒకవేళ పెంచుకున్నా ఇంతకాలం నీతో స్నేహమెలా చేస్తాను? మన పరిచయమైన ఆర్నెల్ల తర్వాత ఇంత చిన్న కోరిక నువ్వు కోరితే అంగీకరించనని ఎలా అనుకున్నావు? నీ ఇష్టం ప్రణయా...?"

* * *

"భానూ.... ఈ రాత్రి మీకే మనిపిస్తోంది" డాబా పైన పండువెన్నెలను చూస్తూ అడిగింది ప్రణయ.

"ఆ చుక్కల మధ్యకు నిన్ను తీసుకెళ్లి విహరించాలని ఉంది".

"ఆ వెండి చందమామపై నీతో కలిసి వాలిపోవాలనుంది"

"అంటే... నన్ను ప్రేమిస్తున్నారా?"

"నా మనసు అదే చెబుతుంది ప్రణయా!"

"నేనేమిటో మీకు తెలుసు. అయినా ఎందుకంత సాహసం?"

"అది సాహసం కాదు. నీ మీద నాకేర్పడ్డ ఇష్టం! ప్రణయా! మరో విషయం చెప్పనా?"

"నిన్ను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను! అంగీకారమేనా?"

నా మాటకు ప్రణయ ఒక్కసారిగా వడివడిగా నవ్వేసింది.

"ఇది జోక్ కాదు. సీరియస్‌గానే చెబుతున్నాను".

"మందారపు మొగ్గలా ఇంకా వికసించని నీ మనసు వాకిళ్లు తెరిస్తే...? శాశ్వతంగా నేను నీకు బందీనైపోతాను! నీకిష్టమేనా?"

"భానూ మీరేనా ఇలా మాట్లాడేది. నేను నమ్మలేకుండా ఉన్నాను. ఇప్పటివరకూ ఎంతోమంది ప్రేమ, పెళ్ళి అంటూ వెంటబడ్డవాళ్లే! అయితే, వాళ్లకూ మీకూ ఓ తేడా ఉంది! వాళ్లు నా శరీరాన్ని అనుభవిస్తూ మత్తులో ప్రేమా, పెళ్లి అంటారు. మీరైతే

రచయిత చిరునామా
కె.రాజబాబు
డివిజనల్ పౌరసంబంధ శాఖాధికారి
అమలాపురం

ఇన్ని రోజులు తర్వాత మాటిగా నా హృదయాన్ని తాకేలా అడుగుతున్నారు. వ్యభిచారం చేసే ఆడదానికి హామీలు ఇవ్వడం తేలిక. ఎందుకో తెలుసా? అవి నెరవేరవు కాబట్టి. శరీరం వేడెక్కినప్పుడు శ్వాస ప్రక్రియల ప్రకంపనల మధ్య జారి బయటపడే మాటలు నిజాలు ఎలా అవుతాయి. అయితే మీ విషయంలో నాకు అలా అనిపించడం లేదు



భామా....! మీరంటే నాకు గొప్ప నమ్మకం ఉంది. నేనో నిజం చెప్పనా? నేను జాగ్రత్తగా పరిశీలించిన మొదటి మగాడు మీరే. అయినప్పటికీ మీ కోరికను మన్నించలేకపోతున్నాను''.

''కాదు... కాదు. మీ కోరికను అంగీకరించే అర్హత నాకు లేదు. ఈ విషయం మీకు చెప్పలేకపోతున్నాను.... భామా... నా మనసేమిటో మీకు చెప్పనా!''

ఏం చెబుతుందోనని ఆసక్తిగా చెప్పమన్నాను.

''మీరంటే నాకిష్టం. మిమ్మల్ని చాలా ఎక్కువగా ప్రేమించాను కూడా. ఇంతవరకూ కనిపించని స్పందన- ఆసక్తి- అభిరుచి- ప్రేమ- ఆకర్షణ- ఇష్టం ఇప్పుడిప్పుడే అంటే మీ పరిచయంలో ఏవో కొత్త కోరికలు పుట్టిస్తున్నాయి.

నా జీవితం ఏదో కొత్త రాగం ఆలపిస్తోంది. ఇంతకాలం మూగబోయిన నా మనసు ఇప్పుడిప్పుడే హాయి ననుభవిస్తోంది. ఏదో తెలియని పులకింత. మీ సమక్షంలో క్షణాలు తీయగా, మత్తుగా గడిచిపోతున్నాయి. మానసికంగా నేను మీకు ఎప్పుడో దగ్గరయ్యాను.

నా శరీరం కోరే ప్రతీ మగాడూ వచ్చిన వెంటనే నువ్వందంగా, అప్సరసలా ఉన్నావంటూ పొగుడుతాడు. కోరిక తీరాక నావైపు అసభ్యంగా, అసహ్యంగా చూస్తాడు. నేను డబ్బు కోసమే వ్యభిచారం చేయడం లేదు భామా...! నా జీవితంలో వెలుగురేఖ చెరిపేసిన మగజాతే నన్ను ఆ వృత్తిలో బలవంతంగా ఉంచేసింది. నా జీవిత గమ్యం విటుల చేతుల్లో దారి తప్పింది. ఊపిరి పీల్చుకునేందుకన్నట్లు ఆగింది ప్రణయ.

''ఇన్నాళ్లకు... ఈ వెన్నెల నాకు అందంగా, ఈ చుక్కలు నాకు ఆశాదీపాల్లా కనిపిస్తున్నాయి. ఈ చల్లగాలి రెపరెపలు నాలో కోరికలు రేపుతున్నాయి. ముడుచుకుపోయిన నా మనసు విచ్చుకుంటోంది. కోరికంటే ఏమిటో రుచి చూడని నా శరీరం- మనసు ఇన్నాళ్లూ మగాళ్ళ క్రింద ఘోరంగా నలిగి పోయాయి. ఇప్పుడు నాలో సున్నితమైన స్పర్శనాడులు స్పందనకు గురవుతున్నాయి భామ!

మీ సమక్షంలో ఇప్పుడు నాకు హాయిగా ఉంది. నా చివరి కోరిక మీరు తీర్చగలిగితే తృప్తిగా నా గతాన్ని సమాధి చేస్తాను. ఈ వెన్నెల అనుభూతి, ఈ చల్లగాలి హాయి నాకు శాశ్వతంగా మిగిలిపోవాలంటే.... నన్ననుభవించు! ప్లీజ్ కాదనకు భామ. నా మనసు కోరుకున్నదాన్ని నాకు దూరం చేయకు ప్లీజ్ భామ ప్లీజ్...''

''ప్రణయా... ఏమిటది పిచ్చిగా? నీ శరీరమే నేను కోరుకుంటే ఆ పని ఎప్పుడో చేసి ఉండేవాడిని. అందుకు ఇన్ని రోజులు ఆగాల్సిన అవసరం లేదు.

నీ ప్రేమను ఇన్నాళ్లూ దాచుకుని నన్ను ప్రేమించినందుకు గుర్తుగా నీ శరీరం నా కర్పించి ఆ తృప్తిని నీవు పొందాలనుకోవడం స్వార్థం కాదా! మరి నా ప్రేమను ఏం చెయ్యను? నీవు కోరుకున్న తృప్తి నాకూ కావాలి. నిన్ను నా దానిగా చేసుకున్న తర్వాత మాత్రమే....''

''భామా!'' ఆమె నావైపు విస్మయంగా- విచిత్రంగా- పిచ్చిగా చూస్తోంది.

''నన్ను పెళ్లి చేసుకుని మీరు అపవిత్రులవుతారా?'' అమాయకంగా ప్రశ్నించింది ప్రణయ.

''లేదు ప్రణయా! అపవిత్రత మనసుకు లేదు. నాకు నువ్వు కావాలి. శాశ్వతంగా! అంతే!!!''

''మీ వ్యక్తిత్వాన్ని మెచ్చి, మనసుపడి నన్ను నేను అర్పించుకోవాలని మిమ్మల్ని రాత్రికి ఉండమన్నాను. మీరేమో నాకు కొత్తజీవితాన్నిస్తానని ఈ పండువెన్నెల సాక్షిగా నన్ను మూగదాన్ని చేశారు'' మత్తుగా, ముద్దుముద్దుగా పలుకుతూ నా గుండెలపై వాలిపోయింది ప్రణయ.

''సిగ్గుతో మబ్బులు చాటుకు మాయమైంది చందమామ. ◆